క్లుప్తంగా

మార్కెట్‌లోకి మధుర ఫలం



నీలమ్మ వేపచెట్టు వద్ద విక్రయిస్తున్న మామిడి పండ్లు

అల్లిపురం: అందరికీ ఇష్టమైన మధుర ఫలాలు మామిడి పండ్లు మార్కెట్లోకి వచ్చేశాయి. వాస్తవానికి వైశాఖ మాసంలో అందుబాటులోకి వచ్చే మామిడి పండ్లు నెల రోజులు ముందుగానే దర్శనమిచ్చాయి. విజయనగరం జిల్లా అలమండ నుంచి రైతులు మామిడి పండ్లు తీసుకుని వచ్చి నగరంలో అమ్మకాలు జరుపుతున్నారు. డజను రూ.250కి విక్రయిస్తున్నారు.

నిమ్మకాయల ధరలు పైపైకి..



పూర్ణామార్కెట్ వద్ద విక్రయిస్తున్న నిమ్మకాయలు

జగదాంబ: నిమ్మకాయ ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఎండాకాలం, ఆపై రంజాన్ నెల కావడంతో నిమ్మకాయ ధరలు అమాంతరం పెరిగిపోయాయి. రూ.10కు ఐదు నుంచి ఏడు కాయలు ఇచ్చే వ్యాపారులు.. ఇప్పుడు రెండు మాత్రమే ఇస్తున్నారు. అవి కూడా చాలా చిన్నగా ఉంటున్నాయి. ఏలూరు నుంచి దిగుబడి అయ్యే నిమ్మకాయలు.. పంట లేకపోవడంతో ధరల పెరుగుదలకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు. బస్తా నిమ్మకాయలు రూ.2,500 వచ్చేవని, ఇప్పుడు బస్తా రూ.10వేలు పెట్టాల్సి వస్తుందని అంటున్నారు. కిలోల లెక్కలో అమ్మకాలు చేస్తే తప్ప, తమకు గిట్టుబాటు అవదని వ్యాపారులు చెబుతున్నారు.

నేటి నుంచి పోలమాంబ పరస



పోలమాంబ అమ్మవారు

దాబాగార్డెన్స్: పాతనగరం ఆశిపాపవీధిలో పోలమాంబ పరస మహోత్సవం ఈ నెల 27, 28వ తేదీల్లో నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం తొలేళ్ల, మంగళవారం పరస జరపనున్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. అమ్మవారికి జలాభిషేకం, పంచామృతాభిషేకంతోపాటు విశేష పూజలు జరపనున్నారు. ఏప్రిల్ 1న అన్నసమారాధన నిర్వహించనున్నారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో ప్రతిభ



ఉపాధ్యాయురాలు ఉషారాణిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

దాబాగార్డెన్స్: నేషనల్ మెరిట్ కమ్ మీన్స్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షలో జీవీఎంసీ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. విద్యార్థులు డి.భవ్యశ్రీ, ఆర్.సంజన, సీహెచ్ భార్గవ్‌ను స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. ఆ విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చిన ఉపాధ్యాయురాలు ఉషారాణిని జీవీఎంసీ దండుబజార్ ఎంపీడీ హైస్కూల్లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. స్కూల్ ప్రధానోపాధ్యాయుడు బి.జనార్దనరావు, ఉపాధ్యాయులు బీజేవీ రమణ, డి.ప్రసాదరావు, గణపతి, ఆనంద్ పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు క్రిస్టియన్లు రుణపడి ఉంటారు

- జాన్‌వెస్లీ, కార్పొరేటర్లు మేరీజోన్స్, జానకీరామ్



ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న జాన్‌వెస్లీ, కార్పొరేటర్ చెన్నా జానకీరామ్



ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ మేరీజోన్స్, మాసిపోగు రాజు తదితరులు

దాబాగార్డెన్స్: దళిత క్రిస్టియన్లను ఎస్సీల్లో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేసినందుకు, ఆమోదానికి కేంద్ర ప్రభుత్వానికి పంపినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ జీవీఎంసీ 36వ వార్డులో కార్పొరేటర్ మేరీజోన్స్, వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు మాసిపోగు రాజు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వార్డు పరిధి ఏవీఎన్ కాలేజీ సమీపాన గల భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ముందుగా పూలమాలలు వేశారు. అనంతరం ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం కార్పొరేటర్ మేరీజోన్స్ మాట్లాడుతూ దళితుడు మరో మతంలోకి మారినంత మాత్రాన జీవన స్థితిగతుల్లో మార్పు ఉండదని, మతం మారినందుకు వారికి రావాల్సిన ఎస్సీల హక్కులు రాకుండా పోవడం అన్యాయమన్నారు. వార్డు అధ్యక్షుడు మాసిపోగు రాజు మాట్లాడుతూ జీవితాంతం దళితులు, దళిత క్రిస్టియన్లు అందరూ ముఖ్యమంత్రి జగన్‌కు రుణపడి ఉంటారని, పార్టీ పటిష్టతకు కృషి చేస్తామన్నారు. 2024 ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసి రుణం తీర్చుకుంటామన్నారు. కార్యక్రమంలో కడితి రమణమ్మ, రమణి, పద్మశ్రీ, కనక మహాలక్ష్మి, స్మిత్ గౌతం, శ్రీధర్, నర్సింగరావు, జీఏ రాజు, సత్యం, నర్సింగ్, బాషా తదితరులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 37వ వార్డు పరిధి జబ్బరతోట క్రీస్తు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ, వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ పాల్గొని ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం జాన్‌వెస్లీ మాట్లాడుతూ ఏపీ అసెంబ్లీ 2 కీలక తీర్మానాలు చేసిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మనం ఎంతో రుణపడి ఉన్నామన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రి భారతదేశంలో ఎక్కడా లేరని చెప్పారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన నవరత్నాల వల్ల క్రైస్తవులందరికీ రూ.200 కోట్ల లబ్ధి చేకూరిందని, ఆర్థికంగానేగాక సామాజికంగా కూడా మంచి జరిగిందని చెప్పారు. ముఖ్యమంత్రి తీర్మానంతో ఎస్సీ విద్యార్థులు, నిరుద్యోగులకు ఎంతో మేలు చేకూరనందన్నారు. కార్యక్రమంలో కాసారపు వాసు, రెయ్యి డేవిడ్‌రాజు, పాస్టర్ నవీన్, ప్రవీణ్, డాక్టర్ రమణ, వెంకటలక్ష్మి, నిమ్మకాయల ఆదిలక్ష్మి, రవి, కమల్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

'జీ-20 సదస్సు వద్ద పోలీసింగ్ కనపడాలి'

అల్లిపురం: జీ-20 సదస్సు వద్ద, అతిథులు పర్యటించే ప్రాంతాల్లో పోలీసులు కాకుండా, పోలీసింగ్ మాత్రమే కనపడాలని నగర పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ సూచించారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం ఆయన ఏయూ కన్వెన్షన్ హాలులో అధికారులు, సిబ్బందితో జరిగిన సమావేశంలో పలు సూచనలు, సలహాలు చేశారు. జీ-20 సదస్సు షెడ్యూల్‌ను వివరించారు. సదస్సు వేదిక వద్ద, వెలుపల ప్రతినిధులు పాల్గొనే కార్యక్రమాల వద్ద సిబ్బంది పాటించాల్సిన నియమాలు వివరించారు. తప్పనిసరిగా సిబ్బంది పాసులు ధరించాలన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న సీపీ శ్రీకాంత్

అధికారులు నిబద్ధతతో పనిచేయాలని ఆదేశించారు.

రాహుల్‌గాంధీపై అనర్హత వేటు సరికాదు

దాబాగార్డెన్స్: కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీపై అనర్హత వేటును రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేడ్కర్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్టా వరప్రసాద్, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోహన్‌లాల్ పాటిల్ తీవ్రంగా ఖండించారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెంటనే జనాభా లెక్కల సేకరణ చేపట్టి ఎస్సీ, ఎస్టీ, బీసీ జనాభాను తేల్చాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వాలు అమలు చేసిన సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు.

'ప్రశ్నించే వారిపై బీజేపీ కేసులు'

సీతమ్మధార: బీజేపీ అవినీతిని ప్రశ్నించిన వారిపై అనర్హత వేటు వేసి కేసులు నమోదు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్‌రెడ్డి ఆరోపించారు. ఎంపీగా రాహుల్ గాంధీపై బీజేపీ ప్రభుత్వం అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా సత్యాగ్రహ దీక్ష నిర్వహించాలని పిలుపు మేరకు ఆదివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఇండియన్ డెమోక్రసీ బ్లాక్ డేగా సంకల్ప సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్షాలపై అప్రజాస్వామికంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రధాని మోదీ, అదానీలపై ప్రశ్నించినందుకు రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేశారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పార్టీ విశాఖ జిల్లా



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్షలో కాంగ్రెస్ పార్టీ నాయకులు

అధ్యక్షుడు గొంప గోవిందరాజు, ఎం.లక్ష్మి, వేగి వెంకటేష్, లక్కరాజు రామారావు, సుధాకర్, జి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ఖాదర్ వలీకి సన్మానం నేడు

ఎంవీపీ కాలనీ: మిల్లెట్ ఆహారంపై విశేష కృషి చేసిన పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఖాదర్ వలీకి సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్టు గో ఆధారిత ప్రకృతి పంటల రైతు సంఘం సంఘం చైర్మన్ పీఎల్ఎస్ రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియం వేదికగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. తొలుత సాయంత్రం డాక్టర్ ఖాదర్ వలీ ప్రసంగం ఉంటుందని, అనంతరం పౌర సన్మానం చేస్తామని తెలిపారు.

తపోదీక్ష.. నియమాలే రక్ష

- 46 రోజుల పాటు పాటిస్తున్న క్రైస్తవులు
- తపోదీక్షలకు 20 ఏళ్లు
- గుడ్ ఫ్రైడేతో ముగింపు



సెయింట్ పీటర్ చర్చిలో దీక్షాధారులనుద్దేశించి మాట్లాడుతున్న రెవరెండ్ ఫాదర్ జాన్ ప్రకాష్



రక్షణ గిరి పుణ్యక్షేత్రంపై దైవ సందేశమిచ్చి శిలువ మార్గం చూపుతున్న ఫాదర్ ఆనంద్

కంచరపాలెం: మానసిక ప్రశాంతత, పాపపరిహారార్థం క్రైస్తవులు తపోదీక్షలను భక్తిశ్రద్ధలతో కొనసాగిస్తున్నారు. 46 రోజుల పాటు సాగే ఈ దీక్ష విభూది ఈ నెల 22తో ప్రారంభమై.. ఏప్రిల్ 7న జరిగే గుడ్‌ఫ్రైడేతో ముగుస్తుంది. ఏసు సువార్త పరిచర్య ప్రారంభించడానికి ముందు 40 రోజులు జెరూసలేంలోని ఎడారి ప్రాంతంలో ఉపవాస దీక్షలు చేపట్టారు. అనంతరం దీనులను ఆయన ఆదుకున్నారు. ఏసు చేసిన ఉపవాస దీక్షలను తపస్కాల తపోదీక్షలుగా పిలుస్తారని జ్ఞానాపురం రక్షణ గిరి పుణ్యక్షేత్రం, సెయింట్ పీటర్స్ పునీత పేతురు రాయప్ప ప్రధాన దేవాలయం రెవరెండ్ ఫాదర్ సీహెచ్.రాజ్‌కుమార్ వివరించారు.

రక్షణ గిరిలో..

ఆదికాలంలో అనేక మంది రాజులు, ప్రవక్తలు, ప్రజలు పాపహారంగా శరీరమంతా బూడిద పూసుకొని గోనెబట్ట ధరించి ఉపవాసంతో 40 రోజులు తపస్సు చేసినట్లుగా పవిత్ర బైబిల్ ధ్రువీకరిస్తోంది. 2003లో రక్షణ గిరిలో తపోదీక్షలు ప్రారంభించి సంఘపరంగా నిర్దిష్ట నియమాలు ప్రవేశపెట్టారు. పూర్వం ఎవరికి వారే ఈ దీక్షలు పాటించేవారు. ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా అనేక మంది సంఘటితంగా దీక్షలను స్వీకరిస్తున్నారు.

పెరుగుతున్న విశ్వాసులు..

భక్తిశ్రద్ధలతో 2003లో తపోదీక్షలు విశాఖ రక్షణగిరి జ్ఞానాపురం పునీత రాయప్ప ప్రధాన దేవాలయం విచారణ కర్తల ఆధ్వర్యంలో పునీత పేతురు దేవాలయంలో అప్పట్లో 150 మందితో దీక్షలు ప్రారంభించారు. ఏటా ఈ దీక్షాధారుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఈ ఏడాది పలు చర్చిల్లో సుమారు 5వేల మందికి పైగా దేవుని సేవలో ఉన్నారని ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాశ్ తెలిపారు.

నిష్ఠతో దీక్షాధారులు..

తపోదీక్షలో జపమాలలను మహిళలు, పురుషులు ధరించారు. దీక్షధారణ సమయంలో నిత్యం దివ్యపూజల్లో పాల్గొంటున్నారు. సూర్యోదయానికి ముందే నిద్రలేచి స్నానం చేసి తెల్లని వస్త్రాలు, నీలి వస్త్రాలు ధరించి మాంసాహారాన్ని, మద్యం విడిచి సన్మార్గంలో పయనించేందుకు నిష్ఠతో దీక్షలు పూనారు.

ఐక్య పోరాటాలతోనే హక్కుల సాధన

సింధియా: కార్మికులు ఐక్యంగా సంఘాభివృద్ధికి పాటుపడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవాలని హిందూస్థాన్ షిప్‌యార్డ్ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. షిప్‌యార్డ్ ప్రాంగణంలో బాబా సాహెబ్ డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకై కృషి చేస్తున్నామని తెలిపారు. ఆదివారం షిప్‌యార్డ్ కాలనీలోని బాలకృష్ణ కల్యాణ మండపంలో షిప్‌యార్డ్ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. డీజీఎం శేఖర్, మేనేజర్ సంతోష్, ఎస్సీ, ఎస్టీ సెల్



సమావేశంలో పాల్గొన్న షిప్‌యార్డ్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ సభ్యులు

నాయకులు కె.శామ్యూల్ మాట్లాడుతూ ఉద్యోగుల భర్తీతోపాటు ప్రమోషన్, ఎల్ అండ్ ఎం సిరీస్ కార్మికులను బ్యాక్‌లాగ్ పోస్టులలో భర్తీకి కృషి చేస్తున్నామన్నారు. అనంతరం సంఘం వార్షిక ఆదాయం, వ్యయం, ప్రగతి నివేదికను ట్రెజరర్ వెంకట అప్పారావు ప్రవేశపెట్టగా సంఘ సభ్యులు ఆమోదించారు. అనంతరం అంబేడ్కర్, సావిత్రిబాయ్‌పూలే, బౌద్ధం పుస్తకాలను నేషనల్ అవార్డు గ్రహీత యూవీ రావ్ అతిథులకు బహూకరించారు.

వైభవంగా నారసింహుడికి ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7నుంచి 8గంటల వరకు స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణమండపంలో వేదికపై అధిష్ఠంపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో అష్టోత్తరశత నామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ కనకరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా నిత్య కల్యాణం: వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంప జేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం చేశారు.

నత్తనడకన వార్డు కార్యాలయం పనులు

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు కార్యాలయం పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పటి వరకు పూర్ణామార్కెట్‌లోనే వార్డు కార్యాలయం ఉండేది. వార్డు ఇన్‌స్పెక్టర్‌తో పాటు మేస్త్రీలు, పారిశుధ్య సిబ్బంది మాత్రమే ఉండే ఈ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది కూడా కలవడంతో సరిపోవడం లేదు. ఈ నేపథ్యంలో వార్డులో జనతాబజార్ వద్ద ఉన్న జీవీఎంసీకి చెందిన భవనం వృథాగా ఉండడంతో ఆధునికీకరణకు వార్డు కార్పొరేటర్ స్పందించి కార్పొరేటర్ నిధులు రూ.5లక్షలు మంజూరు చేశారు. ఈ మేరకు పనులు ప్రారంభించిన మొదట్లో చకచక సాగాయి. తరువాత నెలలు గడుస్తున్నా ముందుకు కదలడం లేదు. వెంటనే అధికారులు స్పందించి భవనం పనులు పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

డస్ట్‌బిన్‌లు శిథిలం



బంగారుమెట్ట కమ్యూనిటీ హాల్ వద్ద పాడైన డంపర్ బిన్



బంగారుమెట్ట ప్రైమరీ స్కూల్ వద్ద శిథిలమైన డంపర్ బిన్

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డులో డస్ట్‌బిన్‌లు శిథిలమై అధ్వానంగా తయారయ్యాయి. మూతలు, కవర్లు లేకపోవడంతో డస్ట్‌బిన్‌లో వేసిన చెత్త బయటే పడుతోంది. దీంతో స్థానికులు కూడా చెత్తను బయటే వేసేసి వెళ్లిపోతున్నారు. చెత్త అంతా బయటే ఉండడంతో దుర్వాసన భరించలేక ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోందని పాదచారులు, వాహనచోదకులు వాపోతున్నారు. జీవీఎంసీ అధికారులు తక్షణమే స్పందించి పాడైన వాటి స్థానంలో కొత్త డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఈ మేరకు వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రభాకర్‌ను వివరణ కోరగా వార్డులో మొత్తం మూడు డంపర్‌బిన్‌లు పాడైనవి ఉన్నాయని, వాటి స్థానంలో కొత్తవాటి కోసం అధికారులకు తెలియజేశామని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

మద్రిపాలెం: అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత మృతి చెందిన ఘటన కంచరపాలెం కప్పరాడ అశోక్‌నగర్ వద్ద ఆదివారం సాయంత్రం జరిగింది. కంచరపాలెం పోలీసులు తెలిపిన వివారలిలా.. కప్పరాడ అశోక్‌నగర్‌లో నివసిస్తున్న శాంతికి(30) ఇషాక్‌తో ఆరేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు 5, రెండున్నర రేళ్ల ఆడపిల్లలు ఉన్నారు. ఆదివారం ఇంటి మేడపైకి వెళ్లిన శాంతి మూడంతస్తుల భవనంపై నుంచి పక్కనే ఉన్న మరో ఇంటి మేడపై పడింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు కంచరపాలెం పోలీసులకు సమాచారం అందించారు. సీఐ విజయ్‌కుమార్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతురాలి తల్లిదండ్రులు సాయంత్రం వరకు ఫిర్యాదు చేయలేదని, వివాహిత ఆత్మహత్యకు పాల్పడిందా లేక ప్రమాదవశాత్తు మృతి చెందిందా అన్న కోణంలో వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న కంచరపాలెం సీఐ విజయ్‌కుమార్

కరకచెట్టు పోలమాంబ జాతరకు ఏర్పాట్లు



ప్రచార రథం ప్రారంభిస్తున్నఈవో సురేష్‌బాబా, పాలక మండలి సభ్యులు

- అమ్మవారి ప్రచార రథం ప్రారంభం
- నేడు పందిరి రాట మహోత్సవం
- 4న వార్షిక పండగ

ఏయూ క్యాంపస్: శ్రీకరకచెట్టు పోలమాంబ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవ ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం ఆలయంలో ఈవో డి.వి.ఎస్.సురేష్‌బాబా, ధర్మకర్తల మండలి చైర్మన్ పిడింట్ల శంకర్‌రెడ్డి కార్యక్రమ వివరాలతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం అమ్మవారి ఉత్సవాలకు సంబంధించిన ప్రచారం రథాన్ని ప్రారంభించారు. అమ్మవారిని పూజించే 14 గ్రామాల్లో వచ్చే నెల 4వ తేదీ వరకు ఈ రథంలో అమ్మవారి ఉత్సవ విగ్రహన్ని ఊరేగిస్తారు.

- మహోత్సవాలలో భాగంగా సోమవారం పందిరి రాట మహోత్సవం, పుట్టబంగారం, అమ్మవారి దేవర పండగలను నిర్వహించనున్నారు. వచ్చేనెల 3న తొలేళ్ల ఉత్సవం, 4న అనుపు మహోత్సవం జరపనున్నారు. 11న మారువారం పండగ నిర్వహించనున్నారు. 15న ఆలయంలో మహాన్నదానం ఏర్పాటు చేయనున్నారు. వచ్చేనెల 25వ తేదీ వరకు ఆలయంలో పండగ వాతావరణం కొనసాగనుంది.
- వార్షిక జాతరలో భాగంగా వచ్చేనెల 3వ తేదీ రాత్రి నుంచి తొలి పూజ, పంచామృత అభిషేకం ప్రారంభమవుతుందని ఈవో తెలిపారు. రూ.1,516 చెల్లించి ఈ పూజలో భక్తులు పాల్గొనవచ్చన్నారు. పూజకు దంపతులను మాత్రమే అనుమతిస్తామన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక దర్శనం, విశిష్ట దర్శనం, ప్రత్యేక లఘు దర్శనం క్యూలైన్లను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

హనుమంతవాక జంక్షన్‌లో తప్పిన ప్రమాదం

ఆరిలోవ: జాతీయ రహదారిపై హనుమంతవాక కూడలి వద్ద ఆదివారం సాయంత్రం పెద్ద ప్రమాదం తప్పింది. ఆగి ఉన్న వాహనాలపైకి ఓ కంటైనర్ లారీ దూసుకొచ్చింది. ఈ ఘటనలో నలుగురు స్వల్ప గాయాలతో బయటపడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆరిలోవ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాయంత్రం 4 గంటల సమయంలో మధురవాడ నుంచి నగరానికి వెళ్తున్న వాహనాలు హనుమంతవాక కూడలి వద్ద సిగ్నల్ పడడంతో ఆగాయి. భీమిలి నుంచి నగరానికి వెళ్తున్న 999 నంబరు ఆర్టీసీ సిటీ బస్ కూడా కూడలి వద్ద ఆగింది. దాని పక్కన పలు ద్విచక్ర వాహనాలు ఆగి ఉన్నాయి. అదే సమయంలో వెనక నుంచి వచ్చిన కంటైనర్ లారీ.. బస్సును ఢీకొడుతూ పక్క నుంచి దూసుకొచ్చింది. అంతేకాకుండా బస్సు పక్కన ఆగి ఉన్న మూడు ద్విచక్ర వాహనాలను కూడా ఢీకొంది. ఆయా బైకులపై వెళ్తున్న నలుగురు కిందపడి స్వల్ప గాయాలపాలయ్యారు. గాయపడిన వారిలో నాలుగేళ్ల చిన్నారి ఉంది. ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయి. ఆర్టీసీ బస్సు మధ్య భాగం నుజ్జయింది. ఈ ఘటనలో ప్రాణాపాయం లేకపోవడంతో ట్రాఫిక్ పోలీసులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. మితిమీరిన వేగంతో వచ్చిన కంటైనర్ లారీ ఆర్టీసీ బస్‌ను ఢీకొట్టడం వల్లే దాని వేగం తగ్గిందని, లేదంటే ద్విచక్ర వాహన చోదకుల పైకి దూసుకుపోయి పెద్ద ప్రమాదం జరిగేదని ప్రత్యక్ష సాక్షులు అంటున్నారు. ఈ ఘటనపై ఆర్టీసీ డ్రైవర్, ద్విచక్ర వాహనచోదకుల ఫిర్యాదు మేరకు కంటైనర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఆరిలోవ పోలీసులు తెలిపారు.



సిటీ బస్సును ఢీకొన్న కంటైనర్